

రాంనగర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

ఏపీలో అంగన్‌వాడీలపై ఎస్మా ఎత్తివేయాలి

- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనార్దన్

రాంనగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వం అంగన్‌వాడీ కార్మికులపై విధించిన ఎస్మాను ఎత్తివేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.జనార్దన్ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కార్మికులపై ఎస్మా విధించడంపై ఐఎఫ్‌టీయూ గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో రాంనగర్ చౌరస్తాలో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పద్ధతిలో సమ్మె చేస్తున్న వారిపై ఎస్మా ప్రయోగించడం తగదన్నారు. అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్‌లను ఏపీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి నెరవేర్చకపోతే ఎన్నికల్లో ఓటమి తప్పదని హెచ్చరించారు. ఐఎఫ్‌టీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు అరుణ, డి.మల్లయ్య, నాయకులు మంగళ, మణక్క, సరోజ, వనజ, రాజమణి, కుమార్, సత్యనారాయణ, పీడీఎస్‌యూ నాయకులు మహేష్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకోవాలి


అన్నదాన కార్యక్రమం ప్రారంభిస్తున్న కల్పనా యాదవ్

ముషీరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలని, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని మాజీ కార్పొరేటర్ ఆర్.కల్పనాయాదవ్ సూచించారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు ప్రభాకర్ యాదవ్ 22వ వర్ధంతిని పురస్కరించుకొని ముషీరాబాద్ రెయిన్‌బో అనాథాశ్రమంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల సాధన, చట్టాల అమలు కోసం ప్రభాకర్ యాదవ్ ఎంతో కృషిచేశారని కొనియాడారు. కాంగ్రెస్ నాయకులు మోహన్‌దాస్, అనిల్ యాదవ్, రజని, ఇందిరాప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

హిందువుల ఓట్లను కొల్లగొట్టేందుకే

రామ మందిర నిర్మాణం : చిట్టిబాబు

రాంనగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో హిందువుల ఓట్లను కొల్లగొట్టేందుకే అయోధ్యలో రామమందిరం నిర్మిస్తున్నారని తెలంగాణ రైతుకూలీ సంఘం రాష్ట్ర నాయకుడు నకిరెకంటి చిట్టిబాబు ఆరోపించారు. శుక్రవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో నరేంద్రమోదీ అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతతత్వ విధానాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ పబ్లిక్ రంగాన్ని దెబ్బతీస్తున్నారని విమర్శించారు. హిందూత్వం పేరుతో గడపగడపకు జై శ్రీరామ్ అంటూ పసుపు, కుంకుమతో కలిపిన బియ్యాన్ని రాముడి అక్షింతలని పంపిణీ చేస్తూ హిందూత్వ వాదాన్ని రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. చంద్ర పుల్లారెడ్డి పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి మల్లెపల్లి ప్రభాకర్, ఏపీ రైతు కూలీ సంఘం నాయకుడు బి.రాజన్న, ఐఎఫ్‌టీయూ నాయకులు షేక్ షావలీ, మహ్మద్ రఫీద్, అఖిలభారత విప్లవ మహిళా సంఘం నాయకురాలు సంపంగి పద్మ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థికి మోడల్ పేపర్లు అందజేస్తున్న ఎమ్మెల్యే

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

- ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్

ముషీరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం భోలక్‌పూర్‌లో మదీనాతులుం హైస్కూల్ విద్యార్థులకు ఎంఐఎం ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు మోడల్ పేపర్ బుక్స్ పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏడాది పదో తరగతి విద్యార్థులకు ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆధ్వర్యంలో మోడల్ పేపర్లు పంపిణీ చేస్తున్నారన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు పేరు తీసుకురావాలన్నారు. కార్పొరేటర్ గౌస్ ఉద్దీన్ తాహా, ముషీరాబాద్ ఐరన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మహ్మద్ ఆదం అలీ, మహ్మద్ గౌస్, ఎంఐఎం పార్టీ ముషీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి యామిన్ తదితరులు పాల్గొన్నారు.


బోరింగ్ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రవిచారి

పాలమూరు బస్తీలో..

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

రాంనగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పాలమూరు బస్తీలో తాగునీటి సమస్య పరిష్కారానికి శాశ్వత చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ కె. రవిచారి తెలిపారు. సికింద్రాబాద్ పార్లమెంట్ సభ్యుడు జి.కిషన్‌రెడ్డి బడ్జెట్‌తో పాలమూరుబస్తీలో మంజూరైన బోరింగ్ పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. బీజేపీ నాయకులు జక్క శ్రీనివాస్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

'రాముడి జీవితం అందరికీ ఆదర్శనీయం'

చిక్కడపల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాముడి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ అన్నారు. మోహన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి త్యాగరాయగానసభలో నిర్వహించిన శ్రీరామ వైభవంపై ప్రవచన ప్రసంగ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాముడు తల్లిదండ్రులను గౌరవించాలని చాటిచెప్పారన్నారు. మాజీ న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతిశర్మ మాట్లాడుతూ.. శ్రీరాముడు సద్గుణసంపన్నుడన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక సేవా సంస్థ రుద్రశిఖర ట్రస్ట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రముఖులు ఆచార్య ముదిగొండ శివప్రసాద్, పి. రామ్మోహన్, శశిబాల, దైవజ్ఞశర్మ, వల్లీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

'వడ్డెరుల సమస్యల పరిష్కారానికి సహకారం'



వడ్డెరుల సమస్యల పరిష్కారానికి సహకరిస్తానని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. వడ్డె ఓబన్న జయంతిని ప్రభుత్వం నిర్వహించినందుకు వడ్డెరుల ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్ట్ కమిటీ సభ్యులు మంత్రిని శుక్రవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ట్రస్ట్ చైర్మన్ జరిపేటి సత్యనారాయణ, వైస్ చైర్మన్ ఎత్తరి అంతయ్య తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

\- చిక్కడపల్లి, ఆంధ్రజ్యోతి

రామమందిర నిర్మాణం హిందువులకు గర్వకారణం

ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

ముషీరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని ముషీరాబాద్ వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో శుక్రవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్, ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం. నవీన్‌గౌడ్ తదితరులు ఆలయాన్ని శుభ్రం చేశారు. లక్ష్మణ్ మాట్లాడుతూ.. అయోధ్యలో రామమందిర నిర్మాణం హిందువులకు గర్వకారణమన్నారు. హిందువుల చిరకాల కోరిక నెరవేర్చేందుకు ప్రధాని నరేంద్రమోదీ ఎంతో కృషిచేశారని పేర్కొన్నారు. ముషీరాబాద్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు బద్రినారాయణ, కంచికుమార్, బీజేపీ నాయకులు రాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాన్ని శుభ్రం చేస్తున్న లక్ష్మణ్, నవీన్ గౌడ్


శ్యామ్‌బాబా మందిర్ ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న కావ్యాకిషన్‌రెడ్డి

'స్వచ్ఛ తీర్థ అభియాన్'లో భాగస్వాములు కావాలి

బర్కత్‌పుర, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆలయాలను పరిశుభ్రంగా ఉంచడానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛ తీర్థ అభియాన్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సతీమణి కావ్యాకిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కాచిగూడ శ్యామ్‌బాబా మందిర్‌లో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతమ్‌రావుతో కలిసి ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్, కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, సెంట్రల్ జిల్లా కోశాధికారి ఏ.సూర్యప్రకాష్‌సింగ్, ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, యువమోర్చా ప్రధాన కార్యదర్శి యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

రామమందిర ప్రారంభోత్సవం దేశ చరిత్రలో కీటక ఘట్టం


శ్రీరామమందిర వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీమంత్రి సి.కృష్ణాయాదవ్, డాక్టర్ ఎస్.గౌతమ్‌రావు

నల్లకుంట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవం దేశ చరిత్రలో కీటక ఘట్టం కానుందని మాజీ మంత్రి సి. కృష్ణాయాదవ్, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతమ్‌రావు అన్నారు. శుక్రవారం ఫీవర్ ఆస్పత్రి చౌరస్తాలో బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ ఎం.మధుసూదన్‌యాదవ్ ఆధ్వర్యంలో అయోధ్యలో శ్రీరామమందిర ప్రారంభోత్సవం వాల్‌పోస్టర్ ఆవిష్కరణ, జై శ్రీరామ్ జెండాల కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న వారు పార్టీ శ్రేణులు, ప్రజలకు జై శ్రీరాం జెండాలను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. 400 ఏళ్ల హిందువుల కల నెరవేరబోతుందన్నారు. బీజేపీ నాయకులు హనుమంతరావు, శిరీష, శ్రీనివాస్, రాఘవ, మురళి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మహాశ్రింగ్ దాసు

22న శ్రీరామచంద్ర

విజయోత్సవ రథయాత్ర

నల్లకుంట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ కృష్ణ కాన్షియస్‌నెస్ (ఇస్కాన్) కూకట్‌పల్లి శాఖ ఆధ్వర్యంలో అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవం, ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఈ నెల 22న శ్రీరామచంద్ర విజయోత్సవ రథయాత్ర నిర్వహిస్తున్నామని ఆ శాఖ అధ్యక్షుడు మహాశ్రింగ్ దాసు వెల్లడించారు. శుక్రవారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 22వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు హైదర్‌నగర్‌లో మైసమ్మ ఆలయంలో హారతితో రథయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. నిజాంపేట చౌరస్తా, జేఎన్‌టీయూ, వివేకానందనగర్, క్రోమా షోరూం మీదుగా హుడా పార్కింగ్ వద్ద ముగుస్తుందన్నారు. యాత్రలో పాల్గొనే భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు. ఇస్కాన్ కూకట్‌పల్లి శాఖ సభ్యులు వెంకటేశ్వరరావు, సునీల్‌రాఠీ, శ్రీవాణి పాల్గొన్నారు.

సీతారాములకు పూజలు

ముషీరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో రామమందిర నిర్మాణాన్ని పురస్కరించుకొని పద్మశాలి కాలనీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం సీతారాములకు పూజలు నిర్వహించారు. సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు సుందర్ పటాలే, ఆర్. ఆంజనేయులు, మహిళా కమిటీ అధ్యక్షురాలు సుజాత మాట్లాడుతూ.. ఈ నెల 22 వరకు కాలనీలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సొసైటీ నాయకులు శ్రీనివాస్, కమల్ కుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వమే

గతంలోకంటే ఎక్కువ ఎంపీ స్థానాలు గెలుస్తాం : డాక్టర్ కె. లక్ష్మణ్

కవాడిగూడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని, గతంలోకంటే ఎక్కువ స్థానాలు గెలవడం ఖాయమని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె లక్ష్మణ్ ధీమా వ్యక్తం చేశారు. వికసిత్ భారత్ సంకల్పయాత్ర పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికి వివరిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా శుక్రవారం కవాడిగూడ శివాజీ చౌక్‌లో వాల్ రైటింగ్‌ను కార్పొరేటర్ జి. రచనశ్రీతో కలిసి ఆయన ప్రారంభించారు. లక్ష్మణ్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ప్రజలందరూ మూడోసారి నరేంద్రమోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, ప్రతిపక్షాలు అయోధ్యలో జరిగే రామమందిర ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని సైతం రాజకీయం చేయడాన్ని దేశ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ తెలంగాణలో ఉనికి కోల్పోయిందన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రంగరాజ్‌గౌడ్, ముషీరాబాద్ కన్వీనర్ ఎం. రమేష్‌రాం, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంసీ మహేందర్‌బాబు, ఎ. ప్రభాకర్, ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు గంటా శ్రీనివాస్, బీజేపీ ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు ఎం. సురేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌వి ఓటు బ్యాంకు రాజకీయాలు

రాంనగర్: రామమందిరం ప్రారంభోత్సవానికి కాంగ్రెస్ పార్టీ హాజరుకాబోమని ప్రకటించి ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతుందని రాజ్యసభ సభ్యుడు, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్ ఆరోపించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా పిలుపు మేరకు ఔర్ ఏక్‌బార్ మోదీ సర్కార్ వాల్ రైటింగ్ కార్యక్రమం రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి ఆధ్వర్యంలో వీఎస్టీ చౌరస్తాలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న లక్ష్మణ్ గోడపై కమలం పువ్వు గుర్తు వేసి, మోదీని మూడోసారి ప్రధానిని చేయాలని రాశారు. కార్పొరేటర్ కె.రవిచారి మాట్లాడారు. బీజేపీ నాయకులు ఉపేందర్, ఆర్.జనార్దన్, వకీల్, శేఖర్, శ్రీనివాస్‌గౌడ్, బాబుగౌడ్ పాల్గొన్నారు.

రేపటి నుంచి కోటి ప్రత్యాంగిర మహాయాగం

కవాడిగూడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జగద్గురు సిద్దేశ్వరానంద భారతి మహాస్వామి 88వ అవతరణోత్సవం సందర్భంగా సిద్దేశ్వర పీఠం కుర్తాళం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 21 నుంచి 28 వరకు దేశంలోనే తొలిసారిగా 108 హోమకుండాలు, 25 వేల కిలోల ఎండు మిరపకాయలతో కోటి ప్రత్యాంగిర మహాయాగం నిర్వహిస్తున్నట్లు పీఠం చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మోచర్ల శశిభూషణ్, ధర్మాధికారి వల్లూరు శివకోటేశ్వరరాజు, కో-ఆర్డినేటర్ మునిపల్లె శ్రీనివాస్, పీఠం పురోహితుడు మాచవోలు రమేష్‌శర్మ తెలిపారు. శుక్రవారం యాగం ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం వారు మాట్లాడారు.

ప్రతి రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు యాగం, సాయంత్రం 6.30 గంటలకు భక్తి సంగీతం, లలిత, విష్ణు, సౌందర్య లహరి, హనుమాన్ చాలీసా పారాయణం ఉంటాయని తెలిపారు. రాత్రి 7.30 గంటలకు వివిధ దేవతామూర్తుల కల్యాణ మహోత్సవం, సిద్దేశ్వరానంద భారతి అనుగ్రహ భాషణం ఉంటుందన్నారు. కార్యక్రమాలకు హాజరైన మొదటి పది వేల మంది భక్తులకు వివిధ దేవతల రూపు, కాసు, రుద్రాక్షలను ప్రసాదంగా అందజేస్తామని వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.


ఎన్టీఆర్ స్టేడియంలో యాగం ఏర్పాట్లను పరిశీలిస్తున్న నిర్వాహకులు శశిభూషణ్, వల్లూరి శివ కోటేశ్వరరాజు, మునిపల్లె శ్రీనివాస్

నేడు, రేపు ఓటరు నమోదు స్పెషల్ క్యాంపెయిన్

రాంనగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పద్దెనిమిది సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటరు లిస్టులో పేరు నమోదు చేసుకోవాలని ముషీరాబాద్ డీఎంసీ డాక్టర్ తిప్పర్తి యాదయ్య అన్నారు. ఈనెల 20, 21న ఓటరు నమోదుకు స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. పోలింగ్ బూత్‌లలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్‌వో) అందుబాటులో ఉంటారని, దరఖాస్తులు అందజేయవచ్చన్నారు.

వచ్చేనెల 16న పారిశ్రామిక సమ్మె

రాంనగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం శ్రమిస్తున్న కార్మిక, రైతుల జీవితాలు, జీవనోపాధిపై కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దాడి చేస్తోందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ ఆరోపించారు. కార్మిక, రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా నిర్వహించే పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో హైదరాబాద్ జిల్లా కార్మిక, ఉద్యోగ, కిసాన్‌మోర్చా సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ సదస్సు శుక్రవారం నిర్వహించారు. కమతం యాదగిరి, ఎం.వెంకటేష్, ఆర్.జనార్దన్ బొడ్డుపల్లి కిషన్ మాట్లాడారు.

హైదరాబాద్ ఎంపీ టికెట్ అమ్జదుల్లాఖాన్‌కు ఇవ్వాలి


రాంనగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పార్లమెంట్ టికెట్ ఎంబీటీ అధినేత, దివంగత అమానుల్లాఖాన్ తనయుడు అమ్జదుల్లాఖాన్‌కు ఇవ్వాలని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీకి టీపీసీసీ క్రైస్తవ సెల్ కో-ఆర్డినేటర్ సీపీ డానియేల్ ఆడమ్ శుక్రవారం వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అమ్జదుల్లాఖాన్‌కు టికెట్ ఇస్తే అసదుద్దీన్ ఒవైసీని ఓడిస్తారని నివేదిక ఇచ్చానన్నారు. తన ప్రతిపాదన పట్ల దీపాదాస్ మున్షీ సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.


పురోహితులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు

పురోహితులకు ఆర్థిక సహాయం

గోల్నాక, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలో 11 దేవాలయాలకు చెందిన పురోహితులకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రతినెలా ఒక్కొక్కరికి రూ. 5 వేలు అందజేస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నారు. శుక్రవారం గోల్నాక తులసినగర్ కాలనీలో క్యాంపు కార్యాలయంలో 11 మంది పురోహితులకు రూ. 5 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను పురోహితులు ఆశీర్వదించారు.


నియామక పత్రం అందుకుంటున్న రమేష్ మంజుల్కర్

వడ్డెర సంక్షేమ సంఘం యువజన విభాగం

జాతీయ అధ్యక్షుడిగా రమేష్ మంజుల్కర్

బర్కత్‌పుర, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం యువజన విభాగం జాతీయ అధ్యక్షుడిగా రమేష్ మంజుల్కర్ నియమితులయ్యారు. సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గుంజ శ్రీనివాస్ చేతుల మీదుగా బషీర్‌బాగ్‌లో సంఘం కార్యాలయంలో శుక్రవారం నియామక పత్రం అందుకున్నారు. రమేష్ మంజుల్కర్ మాట్లాడుతూ. తనను యువజన విభాగం జాతీయ అధ్యక్షుడిగా నియమించిన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గుంజ శ్రీనివాస్‌కు, సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభ్యున్నతి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. సంఘం జాతీయ అధ్యక్షుడు వేముల లక్ష్మణ్, జాతీయ మహిళా విభాగం అధ్యక్షురాలు వి.తిరుమలదేవి, ప్రధాన కార్యదర్శి జి.రేణుక, రాష్ట్ర అధ్యక్షుడు జి.వి.నారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్ల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

'బస్తీల సమస్యలు పరిష్కరించాలి'



ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోగల 9 బస్తీల సమస్యలు పరిష్కరించాలని టీపీసీసీ కార్యదర్శి జీఎస్.కేశవ్ కోరారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను జై భీమ్‌సేన ఫైట్ ఫర్ రైట్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.బల్వంత్‌రావు, ఓయూ బస్తీల అధ్యక్షుడు ఇ.సాయిప్రసాద్, ఎల్లన్న, రాజేష్‌తో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు.

\- రాంనగర్, ఆంధ్రజ్యోతి

రోడ్డుకు మరమ్మతులు చేయాలంటూ ఆందోళన

- బస్తీవాసులతో మాజీ కార్పొరేటర్ బైఠాయింపు
- ఏడాది నుంచి ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు


రోడ్డుపై బైఠాయించిన రవీందర్, బస్తీవాసులు

కవాడిగూడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): డ్రైనేజీ పైపులైన్ కోసం రోడ్డును తవ్వి మరమ్మతులు చేయకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని మాజీ కార్పొరేటర్ టి. రవీందర్ ఆరోపించారు. ఏడాది క్రితం జేబీ అపార్ట్‌మెంట్ గగన్‌మహల్ వద్ద రోడ్డును తవ్వారని అన్నారు. మరమ్మతులు చేయాలని జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్స్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో శుక్రవారం రోడ్డుపై బైఠాయించి స్థానికులతో కలిసి ఆందోళనకు దిగారు సమస్య పరిష్కరించకపోతే జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట బస్తీవాసులతో కలిసి ధర్నా చేస్తానని హెచ్చరించారు. తాళబస్తీ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ శ్రీనివాస్ ముదిరాజ్, బి. శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించాలి'

నల్లకుంట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలు, నైపుణ్యం పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో భాగంగా దేశవ్యాప్తంగా 700 పాఠశాలలను ఎంపిక చేసిందని, వీటిలో నల్లకుంట డివిజన్ తిలక్‌నగర్‌లోని కేర్ మోడల్ హైస్కూల్ కూడా ఉంది. అటల్ టింకరింగ్ ల్యాబ్ ఢిల్లీ ప్రతినిధి ప్రొఫెసర్ డాక్టర్ షేక్ మహమ్మద్ రఫీ, రాష్ట్ర విద్యాశాఖాధికారి విజయలక్ష్మి స్కూల్‌ను శుక్రవారం సందర్శించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్ అంశంపై ఉపాధ్యాయులతో చర్చించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించాలని వారు సూచించారు.

సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా గౌతమ్‌రావు నియామకం

బర్కత్‌పుర, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ ఎస్.గౌతమ్‌రావు రెండోసారి నియమితులయ్యారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా జి.ఆనంద్‌గౌడ్ నియమితులయ్యారు. శుక్రవారం బర్కత్‌పురలో నగర కార్యాలయంలో మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్, సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్ ఆధ్వర్యంలో వారిని సన్మానించారు. కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, నాయకులు ఎ. సూర్యప్రకాష్‌సింగ్, కృష్ణకుమార్, సుభాష్‌పటేల్, క్షీరసాగర్, మల్లికార్జున్, బల్వీర్, భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, రవియాదవ్ పాల్గొన్నారు.

'పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి'

బర్కత్‌పుర, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విశ్రాంత ప్రొఫెసర్ పురుషోత్తమ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం బర్కత్‌పురలో శ్యామలాదేవి డిగ్రీ కళాశాలలో పర్యావరణంపై కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి దానిని పరిరక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ పురుషోత్తమ్‌రెడ్డిని కళాశాల ప్రిన్సిపాల్ బి.లావణ్యకుమారి శాలువాతో సత్కరించారు.

ఏబీఎన్ ఆంధ్రజ్యోతి వాయిస్ ఓవర్ ఆర్టిస్ట్‌కు

23న మీడియా ప్రతిభా పురస్కారం ప్రదానం


షేక్ అన్వారీ

చిక్కడపల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీ సాయంత్రం త్యాగరాయగానసభలో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి న్యూస్ చానల్ వాయిస్ ఓవర్ ఆర్టిస్ట్ షేక్ అన్వారీకి మీడియా ప్రతిభా పురస్కారం ప్రదానం చేస్తున్నట్లు ఆ సంస్థ చైర్మన్ గుదిబండి వెంకటరెడ్డి తెలిపారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శేషశయనారెడ్డి చేతులమీదుగా పురస్కారం ప్రదానం చేస్తామని వివరించారు.

మున్నూరు కాపులకు అధికసీట్లు కేటాయించాలి

చిక్కడపల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో మున్నూరు కాపులకు అధికసీట్లు కేటాయించాలని తెలంగాణ మున్నూరుకాపు యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దశరథం రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. శుక్రవారం చిక్కడపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో నామినేటెడ్ పదవుల్లో మున్నూరు కాపులకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. సంఘం ప్రధానకార్యదర్శి ఎ. మహేందర్, నాయకులు జంగిలి అఖిల్ ప్రసాద్, దారి అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

చిక్కడపల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ మౌనిక తెలిపిన వివరాల ప్రకారం.. రిసాల ప్రాంతానికి చెందిన దంపతులు డి. రాజు, సరిత కుమారుడు కళ్యాణ్ తొమ్మిదవ తరగతి చదువుతూ మధ్యలోనే మానేశాడు. కొన్ని నెలలు ఎలక్ట్రికల్ షాపులో పనిచేసి మానేశాడు. అతడి తల్లి అనారోగ్యంతో 2013లో చనిపోయింది. దీంతో కళ్యాణ్ అమ్మమ్మ శంకరమ్మ వద్ద ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులు నిద్ర లేచి చూడగా కళ్యాణ్ ఇంట్లో ఉరేసుకొని ఉండడటం చూసి చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తండ్రి కొన్నేళ్ల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోవడం, తల్లి మృతి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకొని ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.